క్లుప్తంగా

అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలి

ధర్మారం: మల్లాపూర్ గ్రామంలో రోడ్లపై అక్రమ నిర్మాణాలపై విచారణ చేయించి చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు బుధవారం కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. గ్రామ పంచాయతీ నుంచి గందంవాడకు వెళ్లే దారి రామాలయం వద్ద ఆర్‌అండ్‌బీ రోడ్డు నుంచి గ్రామ పంచాయతీకి వెళ్లే రోడ్లపై ఇద్దరు వ్యక్తులు అక్రమంగా నిర్మాణాలు చేస్తున్నారని మాజీ ఎంపీటీసీ గందం మహేందర్, మాదాసు మల్లయ్య, 8 మంది గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. ఈ విషయంపై పంచాయతీ కార్యదర్శి, మండల పరిషత్ అధికారికి ఫిర్యాదు చేయగా.. నోటీసులిచ్చారన్నారు. ఎంపీవో, కార్యదర్శిని ప్రశ్నిస్తే సరైన సమాధానం చెప్పకుండా దాటవేస్తున్నారని ఆరోపించారు.

చెత్తను ఇష్టానుసారంగా పడేయొద్దు

జ్యోతినగర్: నగర ప్రజలు తమ ఇళ్ల నుంచి వెలువడే చెత్త, వ్యర్థ పదార్థాలను ఇష్టానుసారంగా పడేయొద్దని డిప్యూటీ కమిషనర్ వెంకటస్వామి కోరారు. మేడిపల్లి రోడ్డులో బుధవారం వంద రోజుల కార్యాచరణ ప్రణాళిక చేపట్టారు. ఈ సందర్భంగా తడి–పొడి చెత్త వేరు చేయడం, ప్రతీఇంటి నుంచి చెత్త సేకరించడంపై ప్రజల్లో అవగాహన కల్పించడానికి మెప్మా ఆధ్వర్యంలో స్వశక్తి మహిళలతో ర్యాలీ నిర్వహించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ కిరణ్, మెప్మా టీఎంసీ మౌనిక, సీవోలు శ్వేత, ఊర్మిళ, ఏఈ మధుకర్, ఎంఐఎస్ ఆపరేటర్ శ్రీకాంత్, జవాను సూర్య, ఆర్‌పీలు మంజుల, స్వప్న, ఫర్జానా, ధనలక్ష్మి, సుజాత, పద్మావతి, మెహరాజ్, హేమలత తదితరులు పాల్గొన్నారు.

ఆర్డీవోకు సన్మానం

జ్యోతినగర్: రామగుండం కార్పొరేషన్‌లోని ఐదో డివిజన్ రెవెన్యూ సదస్సుకు బుధవారం హాజరైన ఆర్డీవో గంగయ్య, తహసీల్దార్ ప్రసాద్‌రావును డీసీసీ కార్యదర్శి ఎండీ రహీం శాలువాలు కప్పి సన్మానించారు.

ఎక్సైజ్ అధికారుల తనిఖీలు

రామగుండం: టీటీఎస్ అంతర్గాంలో ఎక్సైజ్ అధికారులు బుధవారం ఆకస్మికంగా తనిఖీలు చేశారు. నాటుసారా ఆలకుంట ఎల్లయ్య వద్ద రెండు లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశారు. నిర్మానుష్య ప్రాంతంలో 150 లీటర్ల బెల్లం పానకం గుర్తించి ధ్వంసం చేశారు. ఎక్సైజ్ ఎస్సై శ్రీనివాస్, హెడ్ కానిస్టేబుల్ ప్రసాద్, కానిస్టేబుల్స్ రఘు, నరేశ్, రాజ్‌కుమార్ తదితరులున్నారు.

రోడ్లపై తిరిగే పశువులను తరలించండి

కోల్‌సిటీ: రామగుండం నగరంలో రోడ్లపై విచ్చలవిడిగా తిరుగుతున్న పశువులను వాటి యజమానులు వెంటనే తరలించాలని మున్సిపల్ కమిషనర్(ఎఫ్‌ఏసీ) జె.అరుణశ్రీ కోరారు. ప్రధాన రహదారుల వెంట పశువులు తిరుగుతుండడంతో రోడ్డు ప్రమాదాలు జరిగే అవకాశముందన్నారు.

అవగాహన లోపంతో శాంతినగర్‌కు అన్యాయం

ఫెర్టిలైజర్‌సిటీ: రామగుండం కార్పొరేషన్ 39వ డివిజన్ పరిధిలోని శాంతినగర్‌ను రామగుండం కార్పొరేషన్ డివిజన్ల పునర్విభజనలో భాగంగా నూతనంగా ఏర్పాటు చేసిన 32వ డివిజన్ పరిధిలోని శారదనగర్, చంద్రబాబుకాలనీలో కలపడంతో శాంతినగర్ ప్రజలకు అన్యాయం జరిగిందని శాంతినగర్ అభివృద్ధి కమిటీ ప్రధాన కార్యదర్శి పల్లె హరీశ్‌రెడ్డి ఆరోపించారు.

ఆయన చూపు సజీవం



సారయ్య(ఫైల్)

కోల్‌సిటీ: గోదావరిఖని ఇందిరానగర్‌కు చెందిన కాకుమాను సారయ్య(76) అనే సింగరేణి రిటైర్డ్ ఉద్యోగి అనారోగ్యంతో మృతిచెందగా.. ఆయన నేత్రాలను కుటుంబ సభ్యులు బుధవారం దానం చేసి ఇద్దరికి చూపును ప్రసాదించారు. రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో హార్టికల్చర్ సూపర్‌వైజర్‌గా పని చేస్తున్న విజయ్‌కుమార్ తండ్రి సారయ్య. సారయ్య సింగరేణి ఫారెస్ట్ విభాగంలో పని చేసి రిటైరయ్యారు. మంగళవారం సాయంత్రం ఇంట్లో అనారోగ్యంతో సారయ్య మృతిచెందాడు. సదాశయ ఫౌండేషన్ జాతీయ ప్రచార కార్యదర్శి కె.ఎస్.వాసు సూచనల మేరకు తండ్రి నేత్రాలను దానం చేయడానికి కొడుకులు, కోడళ్లు, కూతురు, అల్లుడు, మనమరాళ్లు, మనమళ్లు ముందుకొచ్చారు. ఎల్వీ ప్రసాద్ ఐ బ్యాంక్ సీనియర్ టెక్నీషియన్ నరేందర్ సహకారంతో నేత్రాలను సేకరించి హైదరాబాద్‌కు తరలించారు.

ప్రభుత్వ పాఠశాలలకు పాఠ్య పుస్తకాలు

సుల్తానాబాద్: ప్రభుత్వ పాఠశాలలకు పాఠ్య పుస్తకాలను పంపిణీ చేస్తున్నట్లు ఎంఈవో రాజయ్య తెలిపారు. ఎంఆర్సీ భవనంలో ఉన్న పాఠ్య పుస్తకాలను వివిధ పాఠశాలలకు అందజేశారు. పాఠశాల ప్రారంభం రోజే ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు అందించాలనే లక్ష్యంతో పంపిణీ చేసేందుకు పాఠశాలల్లో సిద్ధంగా ఉంచినట్లు తెలిపారు.

భూభారతితో భూసమస్యలు పరిష్కారం



గుంటూరుపల్లిలో దరఖాస్తులు స్వీకరిస్తున్న తహసీల్దార్

ఓదెల: భూభారతి చట్టంతో భూసమస్యలు పరిష్కారమవుతాయని తహసీల్దార్ ధీరజ్‌కుమార్ అన్నారు. కొలనూర్, కొమిర గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు జరిగాయి. కొలనూర్‌లో 93, కొమిరలో 7 దరఖాస్తులు స్వీకరించినట్లు తెలిపారు. డిప్యూటీ తహసీల్దార్ సతీశ్‌రావు పాల్గొన్నారు.

ఫెర్టిలైజర్‌సిటీ: గుంటూరుపల్లి గ్రామంలో భూభారతి రెవెన్యూ సదస్సును బుధవారం పాలకుర్తి తహసీల్దార్ జె.సునీత ప్రారంభించారు. గ్రామంలోని భూసమస్యలను గ్రామస్తులు తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లారు. సంతోష్, ఇస్తియాక్, ముస్తఫా, మహేశ్వరి, ఆసిఫ్ పాల్గొన్నారు.

కాల్వశ్రీరాంపూర్: భూభారతి కార్యక్రమంలో భాగంగా రెండో రోజు బుధవారం ఇప్పలపల్లె, ఆశన్నపల్లె గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఆయా గ్రామాల రైతులు తమ సమస్యలపై అధికారులకు దరఖాస్తులు సమర్పించారు. ప్రతీ దరఖాస్తును పరిశీలించి పరిష్కరిస్తామని తహసీల్దార్ పుల్లూరి జగదీశ్వర్‌రావు అన్నారు.

జూలపల్లి: కాచాపూర్, తెలుకుంట గ్రామాల్లో భూభారతి రెవెన్యూ సదస్సులను రెవెన్యూ అధికారులు నిర్వహించారు. కాచాపూర్‌లో 197, తెలుకుంటలో 111 దరఖాస్తులు వచ్చాయి.

ముత్తారం: ఓడేడు, లక్కారంలో బుధవారం భూభారతి రెవెన్యూ సదస్సులను నిర్వహించారు. భూసమస్యలపై దరఖాస్తులను స్వీకరించినట్లు తహసీల్దార్ మధుసూదన్‌రెడ్డి తెలిపారు.

ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలి



లలితపల్లిలో రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏవో ఉమాపతి

ఎలిగేడు: రైతులు ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలని ఏవో ఉమాపతి అన్నారు. జాతీయ సహజ వ్యవసాయ మిషన్(ఎన్ఎఫ్ఎన్ఎం) పథకం ద్వారా ఒక్కో రైతు ఒక ఎకరం ప్రకృతి వ్యవసాయం (జీరో బడ్జెట్ లేదా సేంద్రియ వ్యవసాయం) చేయడానికి ఎలిగేడు మండలం అనుబంధ గ్రామమైన లలితపల్లిలో బుధవారం రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. రైతుల నుంచి మట్టి నమూనాలను సేకరించారు. ఈ పథకం మూడేళ్లపాటు ఉంటుందని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏవో ఉమాపతి సూచించారు. ఏఈవో సురేశ్ పాల్గొన్నారు.

ముత్తారం: మచ్చుపేటలో ప్రకృతి వ్యవసాయంపై రైతులకు మండల వ్యవసాయ అధికారులు అవగాహన కల్పించారు. మండల వ్యవసాయ అధికారి అనూష మాట్లాడుతూ.. గ్రామంలోని రైతులు తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు.

పేదలకు ఉచిత న్యాయ సహాయం



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి భవాని

మంథని: మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో పేదలకు ఉచిత న్యాయ సహాయం అందిస్తున్నట్లు మంథని సీనియర్ సివిల్ జడ్జి వి.భవాని తెలిపారు. గుజపడుగు గ్రామంలో నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో మాట్లాడుతూ.. ఈనెల 14న నిర్వహించనున్న లోక్ అదాలత్‌లో రాజీకి అవకాశమున్న కేసులను ఇరువర్గాల మధ్య అవగాహనతో పరిష్కరించే అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. బార్ అసోషియేషన్ ఉపాధ్యక్షుడు కె.రఘోతంరెడ్డి పౌరుల హక్కులు, బాధ్యతలు, చట్టాలపై అవగాహన కల్పించారు. తహసీల్దార్ కుమారస్వామి భూభారతి, భూచట్టపరమైన అంశాలపై అవగాహన కల్పించారు. మంథని ఎస్ఐ రమేశ్, న్యాయవాదులు శశిభూషణ్ కాచె, కటకం శ్రీనివాస్, పీఏసీఎస్ చైర్మన్ కొత్త శ్రీనివాస్, లోక్ అదాలత్ సభ్యుడు కనుకుంట్ల స్వామి పాల్గొన్నారు.

వ్యవసాయం, పశు పోషణపై అవగాహన పెంచుకోవాలి



మాట్లాడుతున్న భాస్కర్‌రావు

కాల్వశ్రీరాంపూర్: వ్యవసాయం, పశు పోషణపై రైతులు అవగాహన పెంచుకోవాలని, తద్వారా అధిక దిగుబడులతోపాటు ఆదాయం పొందాలని కృషి విజ్ఞాన కేంద్రం ఉద్యాన శాస్త్రవేత్త డాక్టర్ బి.భాస్కర్‌రావు అన్నారు. ఏవో నాగార్జున నేతృత్వంలో బుధవారం గంగారం, ఊశన్నపల్లె, పెగడపల్లి గ్రామాల్లో వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. డైరెక్టర్ ఆఫ్ ఫౌల్ట్రీ రీసెర్చ్ సెంటర్ హైదరాబాద్‌కు చెందిన శాస్త్రవేత్త డాక్టర్ నిరంజన్ మాట్లాడుతూ.. వ్యవసాయంతోపాటు అనుబంధంగా ఉండే పాడి పశువుల పెంపకం, కోళ్లు, గొర్రెలు, మేకల పెంపకం చేపట్టి ఆదాయాన్ని పొందాలని రైతులకు సూచించారు. ఉద్యాన పంటల అధికారి మహేశ్ మాట్లాడుతూ.. రైతులు పాడి నేలల్లో ఆయిల్‌పాం సాగు చేయాలన్నారు. సలహాలు, సూచనలను సద్వినియోగం చేసుకోవాలని ఏవో నాగార్జున కోరారు. ఏపీఎం కనకయ్య, ఏపీవో మంజుల, టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లు, ఏఈవోలు, రైతులు, మహిళా గ్రూపు సభ్యులు, ఉపాధిహామీ కూలీలు పాల్గొన్నారు.

వికలాంగుడికి వీల్‌చైర్ అందజేత

ధర్మారం: ఎర్రగుంటపల్లి గ్రామానికి చెందిన కొడిచెర్ల స్వామి అనే వికలాంగుడికి విప్ లక్ష్మణ్‌కుమార్ మంజూరు చేయించిన వీల్‌చైర్‌ను బుధవారం మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కొత్త నర్సింహులు అందించారు. గతేడాది రోడ్డు ప్రమాదంలో గాయపడిన స్వామి కంటిచూపు, కాళ్లు, చేతులు కోల్పోయి మంచానికే పరిమితమైన విషయాన్ని నర్సింహులు లక్ష్మణ్‌కుమార్ దృష్టికి తీసుకెళ్లారు.

స్వచ్ఛ కాలనీలకు సహకరించాలి



పారిశుధ్య పనులు పరిశీలిస్తున్న కమిషనర్ నియాజ్

సుల్తానాబాద్: ప్రతి కాలనీని స్వచ్ఛ కాలనీగా తీర్చిదిద్దేందుకు ప్రజలందరూ సహకరించాలని మున్సిపల్ కమిషనర్ మహమ్మద్ నియాజ్ అన్నారు. బుధవారం మున్సిపల్ పరిధిలోని పూసాలలో 100 రోజుల ప్రణాళికలో భాగంగా శానిటేషన్ పరిశీలించారు. కమిషనర్ మాట్లాడుతూ.. స్వచ్ఛతపై తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ప్రజలందరూ కాలనీలను పరిశుభ్రంగా చూసుకుంటే ఎలాంటి రుగ్మతలు దరి చేరవని, తద్వారా ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని అన్నారు. నిత్యం కాలనీలకు చెత్త సేకరణకు వచ్చే వాహనాలకు తడి, పొడి చెత్తను వేరు చేసి అందించాలని కోరారు. మున్సిపల్ పరిధిలో నిర్వహిస్తున్న నర్సరీని పరిశీలించారు. మేనేజర్ అలీమొద్దీన్, మున్సిపల్ శానిటేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

యూనిఫాంలు అందజేత

ధర్మారం: మల్లాపూర్ గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ప్రకాశ్‌నగర్‌లో బుధవారం విద్యార్థులకు ఉచితంగా ఏకరూప దుస్తులను మండల పరిషత్ అభివృద్ధి అధికారి ప్రవీణ్‌కుమార్, మండల విద్యాధికారి ప్రభాకర్ పంపిణీ చేశారు. ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ.. మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు యూనిఫాంలు సిద్ధంగా ఉన్నాయని, పాఠశాల ప్రారంభోత్సవం రోజు కంటే ముందస్తుగానే దుస్తులను అందిస్తామన్నారు. విద్యాధికారి ప్రభాకర్ మాట్లాడుతూ.. మండలంలోని 54 పాఠశాలల్లోని 3,500 మంది విద్యార్థులకు యూనిఫాంలు సిద్ధంగా ఉన్నాయని అన్నారు. ప్రధానోపాధ్యాయురాలు భాగ్యలక్ష్మి, ఏపీఎం తులసీమాత, మండల వీవో అధ్యక్షురాలు లావణ్య, సీసీలు పాల్గొన్నారు.

పెద్దమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠ



ఎమ్మెల్యేను సన్మానించిన నాయకులు

ఓదెల: పొత్కపల్లి గ్రామంలో ముదిరాజుల ఆరాధ్య దైవమైన పెద్దమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠ ఉత్సవాలు ఘనంగా జరిగాయి. బుధవారం పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు ఆధ్వర్యంలో పెద్దమ్మ ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరిగాయి. పెద్దమ్మ తల్లి విగ్రహాన్ని రంగులతో ముస్తాబు చేశారు. మహిళలు నెత్తిన బోనాలతో పెద్దమ్మ తల్లి గుడికి వచ్చారు. ఎమ్మెల్యేను ముదిరాజ్ సంఘం నాయకులు సన్మానించారు.

సమతా గ్రంథాలయానికి చేయూత

జ్యోతినగర్: ప్రముఖ సామాజిక సేవకుడు, నటుడు, కరోనా క్రియేషన్స్ అధినేత, న్యూ ఇండియా పార్టీ రామగుండం నియోజకవర్గ అధ్యక్షుడు వేముల అశోక్ జన్మదినం సందర్భంగా సమతా గ్రంథాలయానికి రూ.2వేల విరాళం ఫోన్‌పే ద్వారా అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. చిన్నారులకు జ్ఞానం పెంపొందించే కథల పుస్తకాలు, విద్యాసంబంధిత పుస్తకాలు కొనుగోలు చేయమని గ్రంథాలయ నిర్వాహకులను కోరారు.

బీజేపీ రాస్తారోకో



రాస్తారోకో చేస్తున్న నాయకులు

కాల్వశ్రీరాంపూర్: మండలంలో అర్హులైన నిరుపేదలకు డబుల్ బెడ్‌రూంలు కేటాయించడంలో కాంగ్రెస్ సర్కార్ నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ తహసీల్ కార్యాలయం సమీపంలో బుధవారం బీజేపీ నాయకులు రాస్తారోకో నిర్వహించారు. అంతకుముందు ర్యాలీగా డబుల్ బెడ్‌రూంల వద్దకెళ్లి నిరసన ప్రదర్శన చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అసంపూర్తి పనులను వెంటనే చేపట్టి అర్హులైనవారికి డబుల్ బెడ్‌రూంలు కేటాయించాలని మాజీ ఎంపీటీసీ జనార్దన్‌రెడ్డి డిమాండ్ చేశారు. తహసీల్ కార్యాలయంలో వినతిపత్రమిచ్చారు. పోలీసులు రాస్తారోకో విరమింపజేసి రాకపోకలను పునరుద్ధరించారు. చంద్రమౌళి, బాలకృష్ణ, ముల్కోజు వెంకటేశ్వరాచారి, రఫీ, సతీశ్, రాధాకృష్ణారెడ్డి, రాజ్‌కుమార్, వైకుంటం, రవీందర్‌గౌడ్, ఆంజనేయులు, కిరణ్‌రెడ్డి, మహేందర్ పాల్గొన్నారు.

లాయర్స్ ఇండియా ఆర్గనైజేషన్ రాష్ట్ర కన్వీనర్‌గా ఇనుముల

మంథని: జాతీయ లాయర్స్ ఇండియా ఆర్గనైజేషన్ రాష్ట్ర కన్వీనర్‌గా మంథనికి చెందిన హైకోర్టు న్యాయవాది ఇనుముల సత్యనారాయణను నియమిస్తూ లాయర్స్ ఇండియా ఆర్గనైజేషన్ జాతీయ కార్యదర్శి పొన్నం రవీందర్ బుధవారం నియామక ఉత్తర్వులు అందించారు. హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో లాయర్స్ ఇండియా ఆర్గనైజేషన్ ద్వారా తెలంగాణ రాష్ట్రంలో సంస్థ కార్యక్రమాలను విస్తరించాలని, లీగల్ అవెర్నెస్, న్యాయవాదుల సంక్షేమ కార్యక్రమాలు, లీగల్ సెమినార్లు, న్యాయ సలహా క్యాంపులు, సంస్థ ఆధ్వర్యంలో ప్రజా ప్రయోజనాల వాజ్యాల దాఖలు, సంస్థ ఆధ్వర్యంలో అధికార, న్యాయ, ప్రభుత్వ సంస్థలకు వినతులు ఇతరత్రా అంశాలు ఆ నియామకం ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా హైకోర్టు న్యాయవాది ఆలే నర్సింహాకు నియామక ఉత్తర్వులు అందించారు.

ప్రభుత్వ బడుల బలోపేతానికే ప్రచార జాత



గోదావరిఖనిటౌన్: ప్రచార జాత కార్యక్రమంలో నాయకులు

గోదావరిఖనిటౌన్: ప్రభుత్వ బడులను బలోపేతం చేసేందుకు పౌర స్పందన వేదిక అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి ఆధ్వర్యంలో ప్రచార జాత కార్యక్రమాన్ని బుధవారం స్థానిక బస్టాండ్ ఆవరణలో నిర్వహించారు. నర్సిరెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వ బడులను బలోపేతం చేసేందుకు ప్రతి తరగతికి ఒక ఉపాధ్యాయుడిని, ప్రతి బడికి ఒక ప్రధానోపాధ్యాయుడిని నియమించాలని ప్రభుత్వాన్ని కోరారు. తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ గౌరవ అధ్యక్షుడు గద్దె శ్రీనివాస్, జిల్లా ప్రధాన కార్యదర్శి కాంపెల్లి లక్ష్మణ్, కోశాధికారి గట్టు శ్రీనివాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పెద్దపల్లిరూరల్: విద్యారంగంలో విప్లవాత్మకమైన మార్పులు తెచ్చేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలని మాజీ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి అన్నారు. తెలంగాణ పౌర స్పందన వేదిక ప్రచార జాత బుధవారం పెద్దపల్లికి చేరింది. జాతను ఉద్దేశించి మాట్లాడారు. నాయకులు ముత్యంరావు, నాగమణి, సీపెల్లి రవీందర్, కల్లెపల్లి అశోక్, విష్ణు, లక్ష్మణ్, ప్రశాంత్, నవీన్ తదితరులున్నారు.

'ఆపరేషన్ మంకీ' షురూ

రామగుండం: 'వానర సైన్యాన్ని ఆపతరమా' శీర్షికన గతనెల 13న 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి అధికారులు ఎట్టకేలకు స్పందించారు. రామగుండం రైల్వేస్టేషన్‌లో కోతుల బెడద నివారణకు రైల్వేశాఖ చొరవ చూపింది. ఈమేరకు ఖమ్మం ప్రాంతానికి చెందిన ఓ ఏజెన్సీతో ఒప్పందం కుదుర్చుకుంది. ఆరు నెలల పాటు స్థానికంగా ఉంటూ ఇక్కడ సంచరించే కోతులను బంధించి అటవీ ప్రాంతాల్లో వదిలిపెట్టాలని కాంట్రాక్టు కుదుర్చుకున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ మేరకు బుధవారం నుంచి కోతులను బంధించడం ప్రారంభించారు. దీంతో తమకు కోతుల బెడద తప్పుతుందని స్థానికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



సక్రమంగా రికార్డుల నిర్వహణ



రామగిరి: ఈజీఎస్ రికార్డులను సక్రమంగా నిర్వహించాలని డీఆర్డీవో కాళిందిని ఆదేశించారు. ఈజీఎస్ ద్వారా చేపట్టిన పనులపై నాలుగో విడత సామాజిక తనిఖీ ప్రజావేదిక ఎంపీడీవో శైలజారాణి అధ్యక్షతన బుధవారం పన్నూర్‌లో నిర్వహించారు. 2024 ఏప్రిల్ 1 నుంచి 2025 మార్చి 31వ తేదీ వరకు 209 పనులు జరిగాయి. వేతనాల కింద రూ. 2.68 కోట్లు, మేటీరియల్‌కు రూ.6,47,091, పంచాయతీరాజ్ చెందిన 74 పనుల్లో వేతనాలకు రూ.8,748, మేటీరియల్ రూ.3.87 కోట్లు చెల్లించినట్లు డీఆర్డీవో తెలిపారు. రూ.77,556 పెనాల్టీగా రికవరీకి ఆదేశించారు. సామాజిక తనిఖీ ఎస్‌టీఎం సాయిజ్ఞానేందర్, ఎస్ఆర్‌పీ రమేశ్, అంబుడ్స్‌పర్సన్ శరత్, విజిలెన్స్ మేనేజర్ కొమురయ్య, ఏపీఎం గణేశ్, క్యూసీ హరికృష్ణ, ఎంపీవో ఉమేశ్ పాల్గొన్నారు.



సుల్తానాబాద్: పట్టణంలోని శాస్త్రినగర్ కుంటలోకి చెరువు నీరు రాకుండా మొరం పోశారు. వర్షానికి నీటి ప్రవాహం ఆ భూమి నుంచి రావాల్సి ఉంది. అడ్డుకట్ట వేయడంతో కుంట నీరు రాక మత్స్య కార్మికుల జీవనోపాధి దెబ్బతిననుంది. నిబంధనలకు విరుద్ధంగా నీటిని అడ్డుకునేందుకు మొరం పోసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని మత్స్య కార్మికులు, ప్రజలు అధికారులను కోరుతున్నారు.

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటినుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 97053 46608, 98499 71500

సింగరేణి వార్తలు

బొగ్గు గని కార్మికుల సెటిలింగ్ అలవెన్స్ రూ.20వేలు



సమావేశంలో పాల్గొన్న కోలిండియా కార్మిక నేతలు

గోదావరిఖని: బొగ్గు గని కార్మికుల సెటిలింగ్ అలవెన్స్ రూ.20వేలు చెల్లించేందుకు అంగీకారం కుదిరిందని సభ్యుడు యాదగిరి సత్తయ్య పేర్కొన్నారు. ఉత్తరాంచల్ రాష్ట్రంలోని డెహ్రాడూన్, రిషికేశ్‌లో జరిగిన సమావేశంలో బొగ్గు గని కార్మికుల సమస్యలపై సుదీర్ఘంగా చర్చించినట్లు వెల్లడించారు. గతంలో సెటిలింగ్ అలవెన్స్ రూ.12వేలుండగా, రూ.20వేలు చెల్లించడానికి అంగీకారం కుదిరిందన్నారు. మెడికల్ అటెండెన్స్ రూల్స్(ఎంఏఆర్) నియమ నిబంధనలను సవరించి తద్వారా అనారోగ్యంగా ఉన్న కార్మికుని హైయర్ సెంటర్ రిఫరల్ చేస్తే అటెండెంట్(సహాయకుడు)కు కూడా ట్రాన్స్‌పోర్ట్ అలవెన్స్ చెల్లించడానికి అంగీకారం కుదిరిందన్నారు. మజ్దూర్ అనే డిజిగ్నేషన్ ఉన్న ప్రతి ఒక్కరికి అసిసెంట్‌గా మార్చుతూ ఆదేశాలు జారీ చేయడానికి అంగీకారం జరిగిందని వెల్లడించారు. బొగ్గు గనులు, ఓపెన్ కాస్ట్ ప్రాజెక్టులు, డిపార్ట్‌మెంట్లలో రాపిడ్ గ్రావిటీ ఫిల్టరేషన్ ద్వారా స్వచ్ఛమైన తాగునీరు అందించడం, వినికిడి(చెవిటి, డీబీహెచ్ఎల్) లోపంతో బాధపడుతున్న ఉద్యోగికి రూ.40వేలు చెల్లించడం, బొగ్గు గనుల్లో యూనియన్ ద్వారా నామినేట్ చేయబడిన మహిళా ప్రతినిధిని మహిళా సాధికారికత కమిటీకి నామినేట్ చేయాలని ఒప్పందం జరిగింది. భూగర్భ గనులు, ఓపెన్ కాస్ట్ ప్రాజెక్టులు, డిపార్ట్‌మెంట్లలో పని చేస్తున్న కార్మికులు, మహిళా కార్మికులకు మొబైల్ టాయిలెట్లు ఏర్పాటు చేయాలని, నేషనల్ కోల్ వేజ్ అగ్రిమెంట్ కేటగిరి–1 నుంచి కేటగిరి–2 కార్మికుల ఎంపికకు బదులు పదోన్నతి ప్రయోజనాలు కల్పించాలని చేసిన డిమాండ్ మేరకు త్వరలోనే పరిష్కారం చేస్తామని హామీ ఇచ్చారు. సర్వీస్ లింకుడ్ ప్రమోషన్ గడువు తేదీ నుంచి అండర్ గ్రౌండ్ కార్మికులకు 7 సంవత్సరాలు, సర్ఫేస్ కార్మికులకు 8 సంవత్సరాలు కాలపరిమితిపై తదుపరి సమావేశంలో నిర్ణయం తీసుకునేందుకు అంగీకరించారు. సంస్థలో పని చేస్తున్న ఫోర్‌మెన్‌లకు 1993 నుంచి నేషనల్ సీనియార్టీ పదోన్నతి కల్పించాలని చర్చించడం తదుపరి సమావేశంలో నిర్ణయం తీసుకుంటారన్నారు. అఖిల భారతీయ కథాన్ మజ్దూర్ సంఘ్ బీఎంఎస్ నుంచి సుధీర్ గురుడే, మజ్రాల్‌హక్ అన్సారి, సింగరేణి నుంచి యాదగిరి సత్తయ్య, ఇతర కార్మిక సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆర్జీ–2 ఏరియా సందర్శన



సన్మానిస్తున్న అధికారులు

గోదావరిఖని: రీజియన్ సేఫ్టీ జీఎం మధుసూదన్ బుధవారం ఆర్జీ–2 ఏరియాను సందర్శించారు. అధికారులతో సమావేశమై బొగ్గు ఉత్పత్తి, ఉత్పాదకత, రక్షణ చర్యలపై చర్చించారు. తొలిసారి వచ్చిన రీజియన్ సేఫ్టీ జీఎంను అధికారులు సన్మానించారు. ఎస్‌వోటూ జీఎం రాముడు, ఏరియా సేఫ్టీ అధికారి సంతోష్ కుమార్, సివిల్ డీజీఎం ధనుంజయ తదితరులు పాల్గొన్నారు.

ఏరియా సేఫ్టీ ఆఫీసర్‌గా భానుప్రసాద్‌రావు



రామగిరి: ఆర్జీ–3, ఏపీఏ ఏరియా సేఫ్టీ ఆఫీసర్‌గా సీఆర్ భానుప్రసాద్‌రావు బుధవారం బాధ్యతలు చేపట్టారు. జీఎం కొలిపాక నాగేశ్వరరావుకు రిపోర్ట్ చేసి విధుల్లో చేరారు. డీవైపీఎం గుర్రం శ్రీహరి, అధికారులు, ఉద్యోగులు శుభాకాంక్షలు తెలిపారు.

బక్రీద్ పండుగను ప్రశాంతంగా జరుపుకోండి

మంథని: బక్రీద్ పండుగను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అందరూ సహకరించాలని మంథని సీఐ రాజు పీస్ కమిటీ సభ్యులకు సూచించారు. బుధవారం స్థానిక పోలీస్ స్టేషన్లో సమావేశమయ్యారు. మంథని, రామగిరి, ముత్తారం ఎస్ఐలు రమేశ్, చంద్రకుమార్, నరేశ్ పాల్గొన్నారు.

బక్రీద్‌కు ఏర్పాట్లు

సుల్తానాబాద్: మండల కేంద్రంలో ఈద్గా వద్ద మున్సిపల్ కార్మికులు శుభ్రం చేస్తున్నారు. బుధవారం మండల కేంద్రంలో ఉన్న పలు ఈద్గా ప్రాంతాల వద్ద శుభ్రం చేయాలని మున్సిపల్ కమిషనర్ మహమ్మద్ నియాజ్ సూచించారు. ఈనెల 7న బక్రీద్ ఉన్నందున ముస్లింలకు ఈద్గా వద్ద ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా శుభ్రం చేయించారు. పోలీసులు ఇప్పటికే ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బందోబస్తు ఏర్పాటు చేశారు. వాహనాల్లో గేదెలు, ఆవులు అక్రమంగా తరలించకుండా ఉండేందుకు చెక్‌పోస్టులను ఏర్పాటు చేశారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే రూ.లక్ష జరిమానా

కాల్వశ్రీరాంపూర్: గుడుంబా తయారు చేస్తూ విక్రయిస్తూ పట్టుబడి బైండోవర్ అయినవారు నిబంధనలు ఉల్లంఘిస్తే రూ.లక్ష జరిమానా చెల్లించాల్సి ఉంటుందని తహసీల్దార్ పుల్లూరి జగదీశ్వర్‌రావు హెచ్చరించారు. కాల్వశ్రీరాంపూర్ పోలీసులు, సుల్తానాబాద్ ఎక్సైజ్ పోలీసులు సంయుక్తంగా తారుపల్లి గ్రామానికి చెందిన 15 మందిని బుధవారం తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశారు.

క్రీడా శిక్షణ శిబిరాలు విద్యార్థులకు అవసరం

సుల్తానాబాద్: ఉచిత క్రీడా శిక్షణ శిబిరాలు విద్యార్థులకు ఎంతో ఉపయోగపడతాయని జిల్లా వాలీబాల్ అసోసియేషన్ అధ్యక్షుడు ముస్త్యాల రవీందర్ అన్నారు. బుధవారం సుల్తానాబాద్ ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో వాలీబాల్ ఉచిత వేసవి క్రీడా శిక్షణ శిబిరం ముగింపు కార్యక్రమం నిర్వహించారు. వాలీబాల్ కోచ్ శ్రవణ్‌కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ సంబరాలు

గోదావరిఖని: పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ ఎంపీగా గెలిచి ఏడాది పూర్తయిన సందర్భంగా స్థానిక ప్రధాన చౌరస్తాలో కాంగ్రెస్ నాయకులు సంబరాలు నిర్వహించారు. బాణసంచా కాల్చి పేదలకు స్వీట్లు పంచి పెట్టారు. మల్లికార్జున్ మాట్లాడుతూ.. పార్లమెంట్ పరిధిలోని అనేక ప్రజాసమస్యలపై పోరాడుతూ వారి సంక్షేమం కోసం పని చేస్తున్నారన్నారు. కామ విజయ్, రాచకొండ కోటేశ్వర్లు, మల్లేశ్‌యాదవ్, హకీం, కోరం నరేందర్‌రెడ్డి, రాతు శ్రీకాంత్, కుమార్, నగేశ్, రాజు పాల్గొన్నారు.